క్లుప్తంగా

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

రామన్నపేట : వరంగల్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మే 18న జరిగే టీజీపాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి చేసి ఎంట్రన్స్‌కు హాజరుకానున్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'డిమాండ్లు పరిష్కరించాలి'



హన్మకొండ : గిరిజనుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ జనరల్ సెక్రెటరీ డాక్టర్ నరేందర్ పవార్, రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని ఓ హోటల్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో గిరిజనుల సమస్యలు, సాధించాల్సిన హక్కులపై చర్చించారు. జూన్ 1న చలో ఖమ్మం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయి మహాసభ నిర్వహించాలని వారు నిర్ణయించారు.

శ్వేతార్కలో పూజలు



కాజీపేట : కాజీపేటలోని శ్వేతార్క ఆలయ వసంతోత్సవ వేడుకలకు తోగుట పీఠాధిపతి మాధవానంద స్వామి సరస్వతి గురువారం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు స్వామివారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారి చేతుల మీదుగా లక్ష్మీనారాయణుల కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు పండితులు తీర్థప్రసాదాల వితరణతో పాటు అన్నపూర్ణ భవనంలో అన్నదానం చేశారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, దేవులపల్లి సదానందం, శనిగరపు రాజ్‌మోహన్, తుమ్మ శ్రీనివాస్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్‌లో చోరీ

కాజీపేట : కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో గురువారం గురుకుంట్ల సంపత్‌కుమార్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం సంపత్‌కుమార్ మధ్యాహ్నం 11 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి తిరిగి 1 గంట వరకు తిరిగి వచ్చే సరికే తాళం పగుల గొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బంగారం వస్తువులు కనిపించలేదని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్లూస్ టీంతో కలిసి ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఎస్సై నవీన్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

'నైతిక విలువల పెంపునకు బాలగోకులం'

హన్మకొండ చౌరస్తా : బాల,బాలికలలో నైతిక విలువులను పెంపొందించడానికే బాలగోకులం పేరుతో వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ వరంగల్ విభాగ్ సంఘ చాలక్ ప్రొఫెసర్ చిలుకమారి సంజీవ అన్నారు. మాధవ స్మారక సమితి వరంగల్ శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ కాకాజీకాలనీలోని శ్రీ వివేకానంద యోగా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరం బాలగోకులంను గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

పట్టుబడితే.. తుక్కే

- పీఎస్‌లలో పేరుకుపోతున్న వాహనాలు
- కేసులు, ఇతరత్రా కారణాలతో తీసుకెళ్లని యజమానులు



కాంప్లెక్స్‌లో తుప్పపట్టిన ఆటోలు



కాజీపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలు

కాజీపేట : వివిధ కారణాలతో పట్టుబడిన వాహనాల యజమానులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఏళ్ల తరబడి పోలీస్ స్టేషన్‌ల్లో వందల సంఖ్యలో వాహనాలు తుక్కుగా పడి ఉంటున్నాయి. ప్రమాదాలకు గురైనవి, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల యజమానులు ఎవరు? వారి చిరునామా ఎక్కడ? ఎందుకు వారు వాహనాలను తీసుకోవడం లేదనేది అంతుచిక్కని వ్యవహారంగా మారింది. కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పదేళ్లలో వందల సంఖ్యలో వాహనాలు ఇలా దర్శనమిస్తాయి. కాజీపేటలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో 250కి పైగా (చిన్న,పెద్ద) వాహనాలున్నాయి. ఆయా పోలీస్‌స్టేషన్ల ఆవరణలు కుప్పలుగా పడి ఉండటంతో గజం స్థలం ఖాళీగా లేకుండా పోయింది. పై అధికారులు స్టేషన్ ఆవరణను శుభ్రంగా ఉంచాలని ఆదేశించడంతో పీఎస్ ఎదురుగా ట్రిబుల్ ఎస్ కాంప్లెక్స్ కిందకు ఉన్న స్థలంలో వాటిని భద్రపరుస్తున్నారు. వాహన యజమానుల వివరాల కోసం రవాణా శాఖకు పోలీసులు లేఖలు రాసిన సరైన సమాచారం లేక మూలన పడేశారు. ఒకవేళ సమాచారం తెలిసినా కోర్టు ద్వారా వచ్చి వాహనాలను తీసుకు వెళ్లడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో అలానే వదిలేస్తున్నారు.

చక్రాలు లేక మట్టిలో కలుస్తూ..

పట్టించుకునే వారు లేక ఆటోలు, లారీలు, డీసీఎంలు, ద్విచక్రవాహనాల చక్రాలు భూమిలో కలిసి పోతున్నాయి. కొన్నింటికి అసలు టైర్లు కూడా లేవు. మరికొన్ని ఛిద్రమయ్యాయి. స్టేషన్ ఆవరణతో పాటు ట్రిబుల్ ఎస్ కాంప్లెక్స్ ఆవరణల్లో పడేసిన కనీసం తుక్కుగా అమ్మడానికి కూడా పనికిరాని విధంగా తయారయ్యాయి. రోడ్డు ప్రమాదాల్లో సంబంధిత వాహనంపై ఎవరైనా చనిపోతే సెంటిమెంట్‌గా భావించి ఆ వాహనం జోలికి రాని వారు ఉన్నారు. దీంతో వాహనాల సంఖ్య పీఎస్‌ల్లో భారీగా పెరిగిపోవడానికి కారణమవుతున్నాయి. వీటిని కాపాడడం పోలీసులకు తలకు మించిన భారంగా మారుతోంది.ఇప్పటికైనా వీటిని సంబంధిత వ్యక్తులకు అప్పగించడమో, వేలం వేయడమో చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాపాడుతున్నాం..

వివిధ కేసుల్లో పట్టుబడిన అన్ని రకాల వాహనాలు ఇక్కడ ఉండటం వల్లే వాటిని ఏం చేయలేక స్టేషన్ ఆవరణల్లో కాపాడుతున్నాం. ఎవరైనా రీలీజింగ్ ఆర్డర్‌తో వస్తే వాహనం ఏ కండిషన్‌లో ఉన్న అప్పగించాల్సి వస్తుంది. జిల్లా అధికారుల ఆదేశాలు లేనిది ఏం చేయడానికి కుదరదు.

- వై.సుధాకర్ రెడ్డి, సీఐ, కాజీపేట

జాగ్రత్తలు పాటిస్తూ ఆడుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్ : ఎండల తీవ్రత దృష్ట్యా పిల్లలు తగు జాగ్రత్తలు పాటిస్తూ ఇష్టమైన క్రీడల్లో సాధన చేసేలా తల్లిదండ్రులు చూసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని గురువారం సాయంత్రం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి కావ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు తాను డాక్టర్‌గా పిల్లల ఆరోగ్యం కోసం జాగ్రత్తలు చెప్పడమే ఇష్టమన్నారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ఉదయం 11 తర్వాత పిల్లలు బయటికి రాకూడదన్నారు. ఉదయం, సాయంత్రం చల్లని సమయాల్లో అనుకున్న క్రీడలలో సాధన చేస్తూ వేసవి సెలవులను సంతోషంగా గడపాలని సూచించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ బాల్యం నుంచే పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నయీంనగర్ : పరకాల శ్రీ చైతన్య మోడ్రన్ స్కూల్‌కు చెందిన 2000–2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 25 వసంతాల(రజతోత్సవ) అపూర్వ సమ్మేళనం గురువారం హనుమకొండలోని ఓ బాంకెట్ హాల్లో నిర్వహించారు. 60 మంది విద్యార్థులు తమ చిన్ననాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు ఎడ్ల సుధాకర్, సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి, ధరనేశ్వర్, శర్మ, కుమారస్వామి, ఉమను శాలువాలతో సత్కరించి మెమోంటోలు అందజేశారు.

కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ వెంకటనారాయణ



మాట్లాడుతున్న వెంకటనారాయణ తదితరులు

కేయూ క్యాంపస్ /హన్మకొండ : దేశంలో జనగణనతో పాటు బీసీ కులగణను చేపట్టనున్నామని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు పేర్కొన్నారు.గురువారం కేయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బాధ్యులు డాక్టర్ సంగని మల్లేశ్వర్, నల్లాని శ్రీనివాస్, కొట్టే భాస్కర్, మంద వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

లింగారెడ్డి ఆశయాలు కొనసాగించాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు



హసన్‌పర్తి : దివంగత నేత, సీపీఐ సీనియర్ నాయకుడు గంగిళ్ల లింగారెడ్డి ఆశయాలు కొనసాగించాలని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని ఎల్లాపురంలో లింగారెడ్డి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాస్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు మోతె లింగారెడ్డి, గంగిళ్ల భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే హక్కులు

- సదస్సులో నిట్ ప్రొఫెసర్ రమ



విద్యారణ్యపురి : నాడు అనేక దేశాల్లో పోరాటాల ఫలితంగానే కార్మికులు హక్కులు సాధించుకోగలగారని ఆయా హక్కులను పరిరక్షించుకునేందుకు కూడా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఏర్పడుతోందని వరంగల్ నిట్ ప్రొఫెసర్ వలుపదాసు రమ పేర్కొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలో సీపీఐ కార్యాలయంలో బూర భిక్షపతి అధ్యక్షతన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఆమెపాల్గొని మాట్లాడారు. తొలుత కవిసమ్మేళనం నిర్వహించగా, పలువురు కవితలు వినిపించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిధి, అటవీ శాఖా మాజీ అధికారి కాజీపేట పురుషోత్తం, భారత్ బచావో ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.వెంగల్‌రెడ్డి, అరసం ప్రధాన కార్యదర్శి మార్క శంకర్ నారాయణ, పాక వెంకటేశ్వర్లు, ప్రకాశం, స్వరూప, భిక్షపతి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట పట్టణాభివృద్ధే లక్ష్యం

- మే డే వేడుకలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట రూరల్ : కాజీపేట అభివృద్ధే లక్ష్యంగా సాగుతున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కాజీపేట బాపూజీనగర్ పోచమ్మగుడి వద్ద గురువారం జరిగిన మే డే వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మే డే జెండాను ఎగురవేశారు. అనంతరం కమ్యూనిటీ హాల్‌లో జరిగిన తాపీమేస్త్రీలు, ఎలక్ట్రీషియన్, పేయింటర్స్, టెంట్ హౌజ్, చిరు వ్యాపారులు, మార్బుల్స్, ఆటో యూనియన్, ప్లంబర్స్ సంఘాల కార్మికుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే కాజీపేట బస్టాండ్, ఫాతిమానగర్ బ్రిడ్జి నిర్మాణ పనులు, దర్గా ఆర్‌యుఆర్ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాజీపేటలోని అన్ని రంగాల కార్మికుల కోసం కార్మిక భవన్ ఏర్పాటు మంజూరు లెటర్‌ను అందజేశారు. ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాజీపేట తహసీల్దార్ బావుసింగ్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ రజాలి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గడిపె శ్రీనివాస్, కాజీపేట పోగుల జాక్సన్, గబ్బెట ఎల్లేష్, కె.శివకుమార్, ఇమ్మడి బాబు, శ్రీకాంత్, రఫీ, బాషా, సర్వర్ పాషా, సుధాకర్, షేక్ అజ్గర్, తదితరులు పాల్గొన్నారు.

'అన్యమతస్తులతో నాయీబ్రాహ్మణులకు అన్యాయం'



పోచమ్మ మైదాన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

దేశాయిపేట : పోచమ్మమైదాన్ ఏరియాలో అన్యమతస్తులు సెలూన్లను ఓపెన్ చేస్తూ, నాయీబ్రాహ్మణుల పొట్టకొడుతూ అన్యాయం చేస్తున్నారని నగర నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కస్తూరి సతీష్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సెలూన్లను ఒక రోజు బంద్ చేసిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పోచమ్మ మైదాన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షౌరవృత్తిని సైతం కార్పొరేట్ సంస్థలు దూరం చేస్తుండడంతో నాయీబ్రాహ్మణులు దౌర్భాగ్యమైన జీవితాన్ని గడపాల్సిన స్థితులు నెలకొంటున్నాయన్నారు. ఇప్పటికైనా సౌమమ్మల్ని గుర్తించి మా వృత్తిని మాకు మాత్రమే కల్పించాలని లేనిచో రానున్న రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పులోని అన్ని ఏరియా అధ్యక్షులు, జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ /హసన్‌పర్తి : వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ఏఎస్ఎం కాలేజీ, ఖిలావరంగల్ పెట్రోల్ పంపు, నానావియా తోట, తాళ్ల పద్మావతి కాలేజీ, దొడ్డి కొమురయ్య నగర్, తిమ్మాపూర్, అల్లీపూర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో కోరారు. హసన్‌పర్తి చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని హసన్‌పర్తి టౌన్‌తో పాటు పెంబర్తి వ్యవసాయ బావులకు విద్యుత్‌ను శుక్ర, శనివారాల్లో (రెండు రోజుల పాటు) నిలిపివేస్తున్నట్లు ఏడీఈ అశోక్ తెలిపారు.

ఉత్తమ సేవలు అందించిన రామ్‌రెడ్డి

హన్మకొండ : అధికారిగా జి.రామ్‌రెడ్డి ఉత్తమ సేవలు అందించారని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి గడ్డం రామ్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. రామ్‌రెడ్డిని కలెక్టర్ ప్రావీణ్య, ఆయా శాఖల జిల్లా అధికారులు, కుటుంబ సభ్యులు శాలువా కప్పి జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు దాసరి మురళీధర్ రెడ్డి, వై.వి.గణేష్, శ్రీనివాస్ కుమార్, మేన శ్రీను, జగన్ మోహన్ రావు, డాక్టర్ అప్పయ్య, బాలరాజు, సంజీవ రెడ్డి, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

రిజిస్ట్రార్‌కు వినతి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ కామన్ మెస్‌లో భోజనం చేయని విద్యార్థులకు మెస్ బిల్లుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి ఇతర బాధ్యులు గురువారం కేయూ రిజిస్ట్రార్ వి.రామచంద్రంను కలిసి వినతిపత్రం సమర్పించారు.

సమ్మె విరమణ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పార్ట్ టైం అధ్యాపకులు కొద్ది రోజులు చేపట్టిన సమ్మెను గురువారం విరమించారు. కేయూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతుందని ఆందోళన విరమించాలని కోరగా, పార్ట్‌టైం అధ్యాపకులు తాము సమ్మెను విరమింప చేస్తున్నట్లుగా పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

కాజీపేట : కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీకి చెందిన యువకుడు దామెర భరత్ (23) మతిస్థిమితం లేక బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై శివకృష్ణ తెలిపారు. ఏప్రిల్ 23వ తేదీ రాత్రి బయటకు వెళ్లిన భరత్ మళ్లీ ఇంటికి చేరుకోకపోవడంతో వెతికిన ఆచూకి లభించలేదని తెలిపారు. దామెర ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

పలువురికి శ్రమశక్తి అవార్డు

ఖిలా వరంగల్ : మే డే సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఖిలా వరంగల్ తూర్పుకోటకు చెందిన బిల్లా శ్రీకాంత్‌తో పాటు కాజీపేట రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్‌కు, ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్–327 టీజీ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి శ్రమశక్తి అవార్డు అందుకున్నారు. రాష్ట్ర కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, లేబర్ కమిషనర్ నగదు పురస్కారంతోపాటు శ్రమశక్తి వార్డును అందజేసి సన్మానించారు.

గులాబీ తోటకు నిప్పు

హసన్‌పర్తి : మండలంలోని బైరాన్‌పల్లిలో ఓ రైతు గులాబీ తోటకు నిప్పుపెట్టగా, బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బైరాన్‌పల్లికి చెందిన రైతు రుద్రారపు కుమారస్వామి సాగుచేస్తున్న గులాబీ తోటలో 200 మొక్కలు పూత దశకు వచ్చాయి. వంగపహాడ్‌కు చెందిన ఓ వ్యక్తి నిప్పు పెట్టినట్లుగా అనుమానం వ్యక్తం చేశాడు. తోటకు నిప్పు పెట్టడం వల్ల సుమారు రూ.50వేల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ సమావేశాన్ని గురువారం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండు రాకేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోతరాజు ఉదయ్‌కిరణ్, జనరల్ సెక్రటరీగా ఇప్ప భరత్, ఉపాధ్యక్షులుగా ప్రణయ్, ధర్మేందర్, సహాయ కార్యదర్శిగా సంజీవ, కోశాధికారిగా బండల శ్రవణ్ ఎన్నికయ్యారు. సమావేశంలో ఆ సంఘం మాజీ అధ్యక్షుడు గుండు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు టోపీల పంపిణీ

దేశాయిపేట : పారిశుద్ధ్య కార్మికులకు పోచమ్మమైదాన్‌లోని మున్సిపల్ వార్డ్ కార్యాలయంలో 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్‌జోషి గురువారం టోపీలను పంపిణీ చేశారు.

వేసవి శిబిరం ప్రారంభం

విద్యారణ్యపురి : హనుమకొండలోని ప్రభుత్వ లష్కర్‌బజార్‌లో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6నుంచి 9వ తరగతి విద్యార్థులకు వేసవి శిబిరాన్ని మండల విద్యాధికారి నెహ్రూ ప్రారంభించారు.

అర్హులకు ప్లాట్లు కేటాయించాలి

వరంగల్ : వరంగల్ లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లో అనధికార ప్లాట్ల కేటాయింపులను రద్దు చేస్తూ అర్హులైన వారికి కేటాయించాలని, అదే విధంగా కవర్ షెడ్డులోని అద్దె బకాయిలను మాఫీ చేయాలని మార్కెట్‌లో కవర్ షెడ్‌కు చెందిన 158 మంది వ్యాపారులు కోరారు. గురువారం మే డే సందర్భంగా విచ్చేసిన మంత్రి కొండా సురేఖకు వారు వినతి పత్రం అందజేశారు.

ఉగ్రదాడి అమానుషం

వరంగల్ : జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కాల్పులు అమానుష చర్య అని దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం శాశ్వత అధ్యక్షుడు డాక్టర్ ఆడెపు రవీందర్ పేర్కొన్నారు. దాడిని ఖండిస్తూ గురువారం దేశాయిపేట 80 ఫీట్ల రోడ్డు నుంచి పోచమ్మ మైదాన్ సెంటర్ వరకు నల్ల బ్యాడ్జీలతో నినాదాలు చేస్తు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు.

ప్రతిభ విద్యార్థులకు నగదు పురస్కారం

విద్యారణ్యపురి : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వరంగల్‌లోని మట్వాడ ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. సందెల రశ్మిక 562 మార్కులు, రామగిరి లక్ష్మీకీర్తన 526 మార్కులు, సంతాబాద్ రజిత్‌కు 514 మార్కులు, రాగిదేవి ప్రసాద్ 505 మార్కులు సాధించారు. గురువారం పాఠశాల హెచ్ఎం కె.అరుణ ఆయా విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు పూలబొకేలు అందించి అభినందించారు. అనంతరం విద్యార్థులకు నగదు పురస్కారాలు ప్రకటించి బహుమతులు అందజేశారు.

కార్తికేయకు అభినందనలు

ఖిలా వరంగల్ : మధ్యకోట ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నిశ్చల్ కార్తికేయకు పదో తరగతి ఫలితాల్లో 579 మార్కులు సాధించి ప్రతిభను చాటాడు. గురువారం ప్రధానోపాధ్యాయుడు పి.ప్రసాద్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శైలేంద్రకుమార్ అభినందించారు.

విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడాలి

మడికొండ : విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఎంఈఓ మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను గురువారం హెచ్ఎం సంధ్యారాణి, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ అభినందించారు. కిన్నెర విష్ణు, 537, బొల్లికొండ హరిక 508, కె.రసజ్ఞ 502 మార్కులు సాధించగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఇన్‌చార్జ్ హరికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

దేశాయిపేట : గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పరిధి ఆరెపల్లి బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వరంగల్ తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో జ్వాలా అవినీతి వ్యతిరేక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకరి ప్రశాంత్, ఆర్‌వి దినకర్‌దేవ్, కృష్ణస్వామి గ్రామస్తులు అచ్చే అమర్నాథ్, తిప్పరపు శ్రీనివాస్. బుర్ర కృష్ణమూర్తి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్: నినాదాలు చేస్తున్న నాయకులు



హన్మకొండ: జెండాను ఆవిష్కరిస్తున్న వీరన్న



కాజీపేట: ఏఆర్‌ఆర్ నగర్ కాలనీలో..



హన్మకొండ: వ్యవసాయ ప్రాంతీయ స్థానం వద్ద..



మే డే స్ఫూర్తితో పోరాడాలి

మే డే వేడుకలను కార్మికులు నగర వ్యాప్తంగా గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎర్ర జెండాలు ఆవిష్కరించి సంబురాలు నిర్వహించారు. చికాగో కార్మికుల పోరాటం ప్రపంచ కార్మికుల హక్కుల పోరాటాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని పలువురు నాయకులు కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐ(యూ)రాష్ట్ర నాయకులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ, కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం, టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బాధ్యులు, కిట్స్ వాకర్లు, ఆటో, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



ఖిలా వరంగల్: సీపీఐ కార్యాలయం ఎదుట అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు



హన్మకొండచౌరస్తా: కుమార్‌పల్లి బుద్ధభవన్ వద్ద



హన్మకొండ చౌరస్తా: మే డే వేడుకల్లో పాల్గొన్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు



ఉర్సుగుట్ట సీపీఎం రామ సురేందర్ భవనం వద్ద..



వరంగల్: బల్దియా ఆవరణలో..



వరంగల్ ఫోర్ట్‌రోడ్డు తహసీల్దార్ కార్యాలయంలో..



కాజీపేట జంక్షన్ ఆటో స్టాండ్‌లో అన్నదానం..